నేడు బాలానగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

బాలానగర్, జనవరి 27 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలానగర్ డివిజన్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు పర్యటించనున్నారు. శ్మశానవాటికల్లో పెండింగ్ పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించనున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, స్థానికులు హాజరు కావాలని సూచించారు. కల్యాణ్‌నగర్ శివాలయం నుంచి చెరబండరాజు నగర్‌లో రెండు శ్మశానవాటికలు, ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనం పరిశీలన, వినాయక్‌నగర్‌లోని శ్మశానవాటిక, ఫిరోజ్‌గూడ శ్మశానవాటికలను పరిశీలించనున్నట్లు కార్పొరేటర్ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

బతుకమ్మకుంట వద్ద ఆక్రమణలు అడ్డుకోవాలి

కొండాపూర్ : శేరిలింగంపల్లి మండల పరిధిలోని హుడా కాలనీ ఫేజ్ -2 సర్వే నం. 366, 367లోని బతుకమ్మ కుంటలో కొనసాగుతున్న ఆక్రమణలను అడ్డుకోవాలంటూ సోమవారం హుడా ఫేజ్ -2 రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బతుకమ్మ కుంటలో వినాయక విగ్రహాల నిమజ్జనం కొనసాగించే వారని, నిర్మాణ వ్యర్థాలతో కుంటను పూర్తిగా మూసివేయడంపై చందానగర్ సర్కిల్ -21 డీసీకి 2023లో ఫిర్యాదు చేశామని అసోసియేషన్ సభ్యులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగ స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పనులు పూర్తిచేయడంలో విఫలం



శ్మశానవాటికలలో పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహయాదవ్, అధికారులు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కేపీహెచ్‌బీ కాలనీ 1,2 ఫేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బాలానగర్, జనవరి 27 : పెండింగ్ పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని 18 శ్మశాన వాటికలను కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. 20 శాతం పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంలో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా చేపట్టిన పనులు ఏమీలేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, శ్మశాన వాటికల అభివృద్ధి, మౌలిక సుదపాయాలు కల్పించి ప్రజాభిమానం చూరగొందన్నారు. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పనులకు నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్లతో కలిసి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు పేర్కొన్నారు. వినతి అందించిన తర్వాత కూడా నిధులు కేటాయించకపోతే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయక తప్పేలా లేదన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని ముస్లిం, హస్మత్‌పేట ఎస్సీ, హస్మత్‌పేట బీసీ, హస్మత్ పేట క్రిస్టియన్, మందులబస్తీ, కోయబస్తీ, వడ్డెర బస్తీ , పందుల బస్తీ ఎస్సీ, యాదవబస్తీ గ్రేవ్ యార్డ్ (18 శ్మశాన వాటికల) అభివృద్ధి పనులకోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ ఆశ, బీఆర్ఎస్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, పోచయ్య, మట్టి శ్రీను, ఖదీర్, మక్కల సత్యనారాయణ, బాలరాజ్, పిట్ల రాజు ముదిరాజ్, ఐలయ్య పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతలు

కేపీహెచ్‌బీ కాలనీ : నేతాజీ పార్కు పనులను పూర్తి చేసి.. తీర్చిదిద్దినందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్ 1,2 ఫేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. 1,2వ ఫేజ్‌లోని 2.37 ఎకరాల్లో హౌసింగ్‌బోర్డ్ 1970 లేఅవుట్ ప్రకారం.. గ్రీన్‌బెల్ట్‌గా చూపడం జరిగిందని, కొద్ది రోజులకు స్థలాన్ని విక్రయించేందుకు యత్నించగా, 2003లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. 2017 తుదితీర్పు ప్రకారం స్థలం కాలనీకే చెందుతుందని ప్రకటించిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు చొరవతో హౌసింగ్ బోర్డు అధికారులు ఖాళీస్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు పనులను ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక నిధులను కేటాయించి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పనులను పూర్తి చేయించారన్నారు. పార్కు అభివృద్ధికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కు అభివృద్ధి చేయడానికి కృషి చేసిన అసోసియేషన్ నాయకులను అభినందించారు. అందరికీ ఉపయోగ పడేలా సదుపాయాలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాజ్‌రెడ్డి, నరసింహారెడ్డి, టి. సాంబయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎంవీబీ చారి, వి.సాంబయ్య పాల్గొన్నారు.

అన్నసమారాధన అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 27 : శివుడి మాలలు ధరించిన స్వాములకు అన్నసమారాధన చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డులోని శ్రీచక్రదిష్ఠాన కామాక్షి సమేత ఏకాంబేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో పూజలు చేశారు. శివస్వాముల దీక్షల సందర్భంగా నెల రోజుల పాటు చేపట్టనున్న అన్నసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, స్థానిక నాయకులు పులి మురళి, వట్టి ఉపేందర్‌రెడ్డి, పాతూరి గోపి, నాగిరెడ్డి, గోపీస్వామి, ప్రవీణ్ పంతులు, వేణు పంతులు, రామకృష్ణ పంతులు, భక్తులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్‌లో సీసీరోడ్డు ప్రారంభం

జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో రూ.72 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ చెరుకులపల్లి తారాచంద్రారెడ్డి, పార్టీ నాయకులు, కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు నిర్విరామంగా పని చేస్తామని భరోసా ఇచ్చారు. కాలనీవాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. - కుత్బుల్లాపూర్

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసిన మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన నిజాంపేట్ కార్పొరేషన్ తాజామాజీ ప్రజాప్రతినిధులు

దుండిగల్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు సోమవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను వేర్వేరుగా వారి, వారి కార్యాలయాల్లో కలిశారు. తాజామాజీ ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శాలువాతో సన్మానించారు. ప్రజా సేవకు పదవులతో పనిలేదని, తాజామాజీలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసిన వారిలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్, మాజీ కార్పొరేటర్లు ప్రణయయాదవ్, రజితరవికాంత్, రవికిరణ్, గాజుల సుజాత, ఆగం రాజుముదిరాజు, పైడి మాధవి, రాఘవేంద్రరావు, బొర్రదేవి చందుముదిరాజు, కో - ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, అభిషేక్‌రెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన నిజాంపేట్ కార్పొరేషన్ తాజామాజీ ప్రజాప్రతినిధులు

భక్తవరవీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

జీడిమెట్ల, జనవరి 27 : చింతల్ డివిజన్, న్యూ లాల్‌బహదూర్ నగర్‌లో భక్తవరవీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మహాశివలింగాన్ని ప్రతిష్ఠించి ఐదేండ్లు పూర్తి అయింది. సోమవారం వార్షికోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జి.సురేశ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ఆలయ కమిటీ చైర్మన్ జగన్ గౌడ్, నిర్వాహకులు శ్రీనివాస్ నాయి, ఆకుల ప్రభాకర్‌గుప్తా, బాలస్వామి గౌడ్, బస్వరాజ్ పాల్గొన్నారు.

బస్‌భవన్‌కు..జేఏసీ నాయకులు

ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు కూకట్‌పల్లి డిపో ఉద్యోగులు బాసటగా నిలిచారు. సోమవారం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు కూకట్‌పల్లి జేఏసీ నాయకులు ఐలయ్య, అక్బర్, మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు బస్‌భవన్‌కు తరలి వెళ్లారు. ఆర్టీసీ కార్మికులందరూ తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు నోటీస్ ఇవ్వడానికి కూకట్‌పల్లి డిపో నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు బయలుదేరారు. - బాలానగర్

క్షయను గుర్తించడానికి సదస్సు

హెచ్ఏఎల్‌లో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వైద్యులు, ఉద్యోగులు

బాలానగర్ : హిందుస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ పరిశ్రమ ఉద్యోగులకు క్షయను గుర్తించడానికి వైద్యశాఖ అధికారులు సదస్సు ఏర్పాటు చేశారు. సోమవారం బాలానగర్‌లోని హెచ్ఏఎల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ జాయింట్ డైరక్టర్ డాక్టర్ రాజేశం, ప్రోగ్రాం మేడ్చల్ జిల్లా అధికారి డాక్టర్ శ్రీదేవి, డబ్ల్యూహెచ్‌వో తెలంగాణ కన్సల్టెంట్ డాక్టర్లు మహేశ్, స్నేహశుక్ల హాజరయ్యారు. ఉద్యోగులకు పలు పరీక్షలు చేశారు. రిపోర్ట్ ఆధారంగా క్షయను గుర్తించి వారికి కావాల్సిన మందులు అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సదస్సు మొదటి రోజు సెక్యూరిటీ గార్డులు, 4వ తరగతి ఉద్యోగులకు పలు పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. హెచ్ఏఎల్‌లో మరో రెండు రోజులు సదస్సు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలానగర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వినోద్, మోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ల పేరుతో ఇబ్బందిపెట్టే వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ స్వామికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్ట్ సంఘం నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ : జర్నలిస్ట్‌ల పేరుతో ఇబ్బందులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాని కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ స్వామికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్ట్‌ల ముసుగులో బోరుబావులు తవ్వుతున్న వారివద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, సామాన్యులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఎంఆర్‌వో స్పందిస్తూ.. జర్నలిస్టులు తీసుకున్న నిర్ణయం మంచి పరిణామాలను దారితీస్తుందని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘం నాయకుడు గడ్డమీది బాలరాజు, ఆర్.కె.దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, ఎంఏ కరీం, మాణిక్యరెడ్డి, నాగరాజు, గంగరాజు, మహేశ్, దామోదర్‌రెడ్డి, హరిబాబు, లక్ష్మణ్, శ్రీనివాస్‌యాదవ్, చంద్ర, సాగర్ రెడ్డి, హరి, పవన్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

జీడిమెట్ల, జనవరి 27 : సుభాష్‌నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలోని సెయింట్ ఆంథోనీ ఫాతిమా హైస్కూల్‌లో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 75 మంది యువకులు 75 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.జోషఫ్, హెచ్ఎం కె.రమేశ్ బాబు, లయన్స్‌క్లబ్ మెంబర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లాపూర్ : పేదలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉంటుందని కాపు సేవ సమితి సీనియర్ సభ్యుడు ఉపకార్యదర్శి లయన్ కెల్లా వెంకట్‌రావు అన్నారు. సోమవారం ఆల్విన్ కాలనీలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో 50 బెడ్లను ఉచితంగా అందజేశారు. వెంకట్‌రావు మాట్లాడుతూ.. మావనసేవే మాధవసేవగా భావించి సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆకుల రామ్ పాల్గొన్నారు.

ప్రమాదాలు నివారించండి

కేపీహెచ్‌బీ కాలనీ : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా సోమవారం హైదర్‌నగర్ శంషీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు తీసుకుని రోడ్లపైకి వెళ్లరాదని, ప్రమాదాలు జరిగితే శిక్షను అనుభవించాల్సి వస్తుందన్నారు. యువకులు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డును దాటాలని, పార్కింగ్ ఏరియాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినతులపై వెంటనే స్పందించాలి

జోనల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

మియాపూర్ , జనవరి 27 : శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇక్కడి జోనల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఎల్లక్ట్రికల్, యూబీడీ, వెటర్నరీ, సానిటేషన్ విభాగాల అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజావాణిలో అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జోనల్ కార్యాలయంలో పలు సమస్యలపై ప్రజల నుంచి 7 వినతులు రాగా.. జోన్ వ్యాప్తంగా పలు విభాగాలకు సంబంధించి 17 వినతులు అందాయి. అందులో కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు. జడ్సీ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణి అత్యంత కీలకమైన వేదికన్నారు. ప్రజావాణి సందర్భంగా వారి నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేసారు. ప్రతి వినతిని విధిగా సర్కిళ్లలో రికార్డుల్లో నమోదు చేయాలని, సకాలంలో పరిష్కరించి సమాచారం అందించాలని సూచించారు. ప్రతి సోమవారం సర్కిళ్లలో డీసీ సహా ఆయా విభాగాల అధికారులు విధిగా ప్రజావాణిలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఈఈ మల్లికార్జున్, డీడీ శ్రీనివాస్, విల్సన్, సిటీ ప్లానర్ శ్యాం, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 39 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 27 : కూకట్‌పల్లి జోన్, జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 39 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో 13 ఫిర్యాదులు రాగా.. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 12 , ఎలక్ట్రికల్ విభాగానికి ఒక ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. మూసాపేట సర్కిల్ కార్యాలయంలో 9 ఫిర్యాదులు రాగా.. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5, శానిటేషన్ విభాగానికి 2, విద్యుత్ వీధి దీపాలు 2 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణికి 17 ఫిర్యాదులు రాగా, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 14, యూసీడీ విభాగానికి 2 , రెవెన్యూ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, సీపీ గణపతి, ఉద్యానవనం డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, సర్కిళ్ల ఉప కమిషనర్లు వంశీకృష్ణ, గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ ప్రారంభానికి అనుమతులు లేవు

దుండిగల్, జనవరి 27 : బాచుపల్లి మండలం, బాచుపల్లిలోని రెడ్డీస్ ల్యాబ్ ఎదురుగా ఏర్పాటు చేసిన ' ఆస్ట్రా లుమీనా ' స్కూల్ ప్రారంభానికి అనుమతులు లేవని పేర్కొంటూ మండల ఎడ్యూకేషన్ అధికారి(ఎంఈవో) సోమవారం సదరు పాఠశాలను సీజ్‌చేశారు. పలువురి నుంచి ఫిర్యాదులు అందడంతో సోమవారం ఎంఈవో ఎంవీవీ.రామకృష్ణ పాఠశాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేవని తేలడంతో బోర్డును తొలగించడంతో పాటు సీజ్ చేశారు.

న్యూ హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ బీ - బ్లాక్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి కాలనీకి చెందిన ఉప్పరి రంగన్న రూ. 50,116ల నగదును సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. - కొండాపూర్

వైద్యశిబిరానికి స్పందన

రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో తులిప్ దవాఖాన వైద్యురాలు అర్పిత ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. లక్ష్మీనాథ్, సంజయ్, మహేశ్, జ్యోతి, స్రవంతి, సురేశ్, ఆనంద్, అప్పారావు పాల్గొన్నారు. - జగద్గిరిగుట్ట

కార్పొరేటర్ పర్యటన

మియాపూర్ : హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ శాతవాహన కాలనీలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. దోమల నివారణకు సంబంధించి డ్రోన్ ద్వారా మందులను స్ప్రే చేయించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి అండగా నిలుస్తానని, తాగునీరు , అంతర్గత రహదారులు, డ్రైనేజీ, వరద కాలువల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీ ప్రజలకు అందుబాటులో సేవలను అందిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ, రాజీవ్, సత్యనారాయణ, సుధాకర్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా..

కేపీహెచ్‌బీ కాలనీ : కార్మికులకు అండగా ఉంటానని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు రవిసింగ్ అన్నారు. గ్లాడియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సెక్యూరిటీ కాంటాక్ట్ ఆఫీస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న అబ్బాస్‌కు పనిమానేశాడు. అతనికి రావాల్సిన జీతం డబ్బులను ఇవ్వడానికి నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారు. బాధితుడు కార్మిక సంఘం నాయకులను ఆశ్రయించగా.. సంస్థ నిర్వాహకులతో మాట్లాడి జీతం డబ్బులను ఇప్పించారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

దుండిగల్ : కేంద్రం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) స్థానంలో పాత పెన్షన్(ఓపీఎస్) విధానం కొనసాగించాలని పీఆర్టీయూటీఎస్ బాచుపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు పర్శగల్ల నర్సింహులు, మాలి ప్రమోద్‌రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో కలిసి బాచుపల్లి డిప్యూటీ తాసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పోకల శేఖర్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నయ్య, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my client, Voleti Sudhir is intending to purchase the below mentioned property from the owner Boddu Surya Prakash Rao, Residing at F-502, Sais Indu Pride, Sanathnagar, Hyderabad-500 018.

If anybody has any objection, claim, interest or dispute regarding the above intended sale transaction, he/she/they are hereby requested to contact the undersigned with documentary prof substantiating their objections/claims/details of the dispute within seven (7) days if the date of this publication. Failing which, my client will proceed to complete the sale transaction with the above owner as if there are no third-party claims/objections/disputes in respect of the scheduled property and thereafter no third-party claims/objections in respect of this property will be entertained.

SCHEDULE OF PROPERTY

Plot: 4/P Extent: 70 Sq.yds., Boundaries: [N]: 33 Feet wide Road, [S]: Plot No. 4/Part, [E]: Plot 4/Part, [W]: Plot 5/Part, Nallagandla Village, Rangareddy, TS-500 075.

Sd/- SRIHARSHITA CHADA, Advocate
Office: H.No. 5-3/1/R/2/221, RNS Colony, Boduppal, Hyderabad, TS-500 092,
Contact: 8309198698, 81.